

ఖమ్మంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న నామా నాగేశ్వరరావు

నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 ఖమ్మం, మంగళవారం 14 మే 2024 BHADRADRI KOTHAGUDEM

# ఖమ్మంలో 75 శాతం పోలింగ్

- లోక్‌సభ స్థానంలో ప్రశాంతంగా ముగిసిన ఓటింగ్
- సొంతూళ్లలో ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు
- సమస్యలపై రాయమాధారం, రేగళ్లలో ఎన్నికల బహిష్కరణ
- అధికారుల హామీతో విరమించి ఓట్లు వేసిన గ్రామస్తులు



బోనకల్లు : ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులు తీరిన మహిళా ఓటర్లు



ఖమ్మం, మే 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సోమవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో పోలింగ్ ముగిసి 75.19 శాతంగా నమోదైంది. అయితే జిల్లాలో కొన్నిచోట్ల ఉదయం సమయంలో ఈవీఎంలు మొరాయించగా అధికారులు తక్షణం స్పందించి పోలింగ్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో అత్యధికంగా పాలేరు అసెంబ్లీ సెగ్మెంట్‌లో, అత్యల్పంగా ఖమ్మం అసెంబ్లీ సెగ్మెంట్లోపోలింగ్ శాతం నమోదైంది. భద్రాద్రి జిల్లాలోని తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలు మినహా మిగిలిన నియోజకవర్గాల్లోనూ సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. అయినప్పటికీ ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల కన్నా కొంత మేర పోలింగ్ శాతం తగ్గింది. గ్రామీణ ప్రాంతాల్లోని అని వర్గాల ప్రజలూ పోలింగ్‌కు బారులు తీరారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఖమ్మం సీపీ సునీల్‌దత్ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

**కొన్ని చోట్ల పోలింగ్ బహిష్కరణ..**

భద్రాద్రి జిల్లా గుండాల మండలం పెద్దతోగు బూత్‌లో గ్రామస్తులు ఓట్లు వేయకుండా గ్రామంలో బైఠాయించారు. ఆ గ్రామంలో 102 మంది ఓటర్లుండగా ఆ గ్రామంలోని బూత్‌లో కేవలం 21 మందికి మాత్రమే ఓటు వేసే అవకాశం కల్పించారు. మిగతా వారికి సుమారు 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుండాల మండల కేంద్రంలోని బూత్‌ను కేటాయించారు. దీంతో గ్రామస్తులు ఆగ్రహించారు. అంతదూరం తాము వెళ్లలేమని, తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ ప్రకార్డులు ప్రదర్శిస్తూ గ్రామంలో బైఠాయించారు. అధికారులు సర్దిచెప్పడంతో వారు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

| నియోజకవర్గాల వారీగా పోలింగ్ శాతం | |
|---|---|
| ఖమ్మం | 62.50 |
| పాలేరు | 83.30 |
| మధిర | 81.30 |
| వైరా | 80.56 |
| సత్తుపల్లి | 80.00 |
| కొత్తగూడెం | 66.17 |
| అశ్వారావుపేట | 80.36 |

అలాగే, తాగునీరు, సాగునీరు సహా గ్రామ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏన్కూరు మండలం రాయమాధారం, లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల, ఇల్లెందు మండలం కొమ్మగూడెం గ్రామాల్లో గ్రామస్తులు ఓటింగ్‌ను బహిష్కరించారు. విషయం తెలుసుకున్న అధికారులు వెంటనే ఆయా గ్రామాలకు వెళ్లి ఓటర్లకు నచ్చచెప్పారు. పరిష్కరిస్తామని హామీలు ఇచ్చిన అనంతరం ఓటర్లు తమ నిరసన మిరమించి ఓటింగ్‌కు హాజరయ్యారు.



ఖమ్మంలో ఓటు వేసిన కలెక్టర్ దంపతులు



పాల్వంచలో ఓటు వేసిన భద్రాద్రి కలెక్టర్

**ఓటు వేసిన ప్రముఖులు..**

ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు ఖమ్మం నెహ్రూనగర్‌లో, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఖమ్మం బుర్హాన్‌పురంలో, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఖమ్మం నగరంలో, ఎమ్మెల్సీ తాతా మధు తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలులో, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య సత్తుపల్లిలో, కందాల ఉపేందర్‌రెడ్డి కూసుమంచిలో, వనమా వెంకటేశ్వరరావు కొత్తగూడెంలో, జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు వైరాలో, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మధిరలో, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కల్లూరు మండలం నారాయణపురంలో, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం నగరంలో, ఎమ్మెల్యేలు రాందాస్‌నాయక్ వైరాలో, రాగమయి సత్తుపల్లిలో, కూనంనేని సాంబశివరావు కొత్తగూడెంలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

**పోలింగ్ సరళి పర్యవేక్షణ..**

జిల్లాలో పోలింగ్ సరళిని బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధు తదితరులు వివిధ పోలింగ్ కేంద్రాల్లో పరిశీలించారు. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ పూర్తయిన చోట పోలింగ్ కేంద్రాల్లోని ఈవీఎంలను భారీ బందోబస్తు మధ్య జిల్లా కేంద్రానికి తరలించారు. పోలింగ్ కేంద్రాల్లో సరైన ఏర్పాట్లు లేవని, ఈవీఎంలను క్రమపద్ధతిలో కాకుండా వెనుకనుంచి ముందుకు అమర్చారని బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు అధికారులకు ఫిర్యాదు చేశారు.

**బీఆర్‌ఎస్ కార్యకర్తపై కాంగ్రెస్ ఏజెంట్ దాడి..**

బోనకల్లు మండలం ఆళ్లపాడులో స్వతంత్ర ఏజెంట్‌గా ఉన్న బీఆర్‌ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ ఏజెంట్ దాడి చేశాడు. బాధిత ఏజెంట్ కథనం ప్రకారం.. బీఆర్‌ఎస్ కార్యకర్త మరీదు వెంకయ్య ఆళ్లపాడు 133వ బూత్‌లో స్వతంత్ర ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నాడు. ఈ క్రమంలో కాంగ్రెస్ ఏజెంట్ నరసింగుల సతీశ్ అదే గ్రామానికి చెందిన ఓ మహిళా ఓటరుతో వెళ్లి ఈవీఎం బటన్ నొక్కాడు. దీనిపై బీఆర్‌ఎస్ ఏజెంట్ నల్లబోయిన కృష్ణారావు, బీఆర్‌ఎస్ కార్యకర్త అయిన స్వతంత్ర ఏజెంట్ మరీదు వెంకయ్య అభ్యంతరం తెలిపారు. దీంతో కాంగ్రెస్ కార్యకర్తలు ఆక్రోశంతో ఊగిపోయారు. ఇదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త బండి గోపి అనుమతిలేనప్పటికీ పలువురు ఓటర్లను పదేపదే బూత్‌లోకి తీసుకొచ్చి కాంగ్రెస్‌కు ఓట్లు వేయించే ప్రయత్నం చేశాడు. దీనిపై బీఆర్‌ఎస్ చెందిన ఏజెంట్లు పోలింగ్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సాక్షాత్తూ పోలింగ్ ఆఫీసర్లు, సీసీ కెమెరాల సాక్షిగా బీఆర్‌ఎస్ కార్యకర్త అయిన స్వతంత్ర ఏజెంట్ మరీదు వెంకయ్య ముఖంపై కాంగ్రెస్ ఏజెంట్ సతీశ్ పిడిగుద్దులు గుద్దాడు. అక్కడున్న ఏజెంట్లు, ఓటర్లు, ఇతరులు సముదాయించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.



ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్ దంపతులు



ఓటు హక్కు వినియోగించుకున్న వద్దిరాజు దంపతులు



ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్సీ తాతా మధు



ఓటు హక్కు వినియోగించుకున్న పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా



ఓటు హక్కు వినియోగించుకున్న బానోతు చంద్రావతి



ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

మాజీ ఎమ్మెల్యే వనమా దంపతులు

మాజీ ఎమ్మెల్యే కందాల దంపతులు

మాజీ ఎమ్మెల్యే సండ్ర దంపతులు

మాజీ ఎమ్మెల్యే హరిప్రియ దంపతులు

ఓటు వేసిన జడ్పీ చైర్మన్ కమల్‌రాజు

## ‘భద్రాద్రి’లో ప్రశాంతంగా పోలింగ్

- ఎండ కారణంగా ఉదయాన్నే పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు
- వృద్ధులు, దివ్యాంగులకు అక్కడక్కడా కొన్ని ఇబ్బందులు



కొత్తగూడెంలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న మహిళా ఓటర్లు

భద్రాద్రి కొత్తగూడెం, మే 13 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఎండ కారణంగా ఓటర్లు ఉదయాన్నే పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. దీంతో ఉదయం పూటనే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరి కన్పించారు. జిల్లాలోని ఐదు అసెంబ్లీ సెగ్మెంట్లలో భద్రాచలం, పినపాక, ఇల్లెందు స్థానాలు మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోనూ, కొత్తగూడెం, అశ్వారావుపేట స్థానాలు ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గంలోనూ ఉన్నాయి. దీనికితోడు భద్రాద్రి జిల్లా మావోయిస్టుల ప్రభావిత ప్రాంతం. దీంతో అక్కడక్కడా కొన్ని ఇబ్బందులు తలెత్తినప్పటికీ అధికారులు సమర్థవంతంగా పనిచేసి ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా పూర్తి చేశారు. ముఖ్యంగా కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ రోహిత్‌రాజు ప్రత్యేక దృష్టితో నిరంతర పర్యవేక్షణ చేశారు. తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, ఇతర ప్రముఖులు తమ పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేశారు. కలెక్టర్ ప్రియాంక, మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు పాల్వంచలోనూ, ఎస్పీ రోహిత్‌రాజు, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చుంచుపల్లినూ తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. చుంచుపల్లి మండలం రాంనగర్‌లో ఒక పోలింగ్ బూత్‌లో 1,050 ఓటర్లు ఉండగా.. మధ్యాహ్నం తర్వాత కూడా 400 మందే తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

**పోలింగ్ శాతం ఇలా..**

జిల్లాలో ఉన్న ఐదు అసెంబ్లీ సెగ్మెంట్లలోని పోలింగ్ తీరును కలెక్టర్ ప్రియాంక వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. కొన్ని కేంద్రాలకు స్వయంగా వెళ్లి ఓటర్లతో మాట్లాడారు. ఉదయం 7 గంటలకు ఓటింగ్ ప్రారంభం కాగా.. ఆయా సమయాల్లో నమోదైన పోలింగ్ శాతాన్ని ఉదయం 9 గంటలకు, మధ్యాహ్నం 12 గంటలకు, 3 గంటలకు, సాయంత్రం 5 గంటలకు కలెక్టర్ విడుదల చేశారు. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా పరిశీలిస్తే.. భద్రాచలంలో 64.72 శాతం, పినపాకలో 65.91 శాతం, ఇల్లెందులో 69.11 శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా అశ్వారావుపేటలో ఎక్కువ శాతం ఓట్లు పోలయ్యాయి.



ఓటు హక్కు వినియోగించుకున్న ఎస్పీ రోహిత్ రాజు

**పోలింగ్ ప్రశాంతంగా జరిగింది : ప్రియాంక, భద్రాద్రి కలెక్టర్**

భద్రాద్రి జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మార్చి 16న షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి సోమవారం పోలింగ్ పూర్తయ్యే వరకూ అందరి సహకారంతో జిల్లా యంత్రాంగం అహర్నిశలూ శ్రమించింది. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు ముగిశాయి. శాంతిభద్రతల విషయంలోనూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటుచేసుకోలేదు. సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు.



## ఖమ్మంలో నామాదే గెలుపు..

### బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్



పిండిప్రోలులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాతా మధుసూదన్

తిరుమలాయపాలెం, మే 13 : బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు గెలుపు ఖాయమని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అన్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత సోమవారం సాయంత్రం తన స్వగ్రామమైన పిండిప్రోలులో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేసినట్లు చెప్పారు. ఈసారి విజ్ఞతతో అన్ని వర్గాల ప్రజలు బీఆర్‌ఎస్ అభ్యర్థి నామాకు ఓట్లు వేసినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఈ ప్రాంత ప్రజలకు తెలియకపోవడం, బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా ఈ ప్రాంతానికి చెందినవాడు కావడం, ప్రజల కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టడం వల్ల భారీగా ఓట్లు పోలైనట్లు తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి కూసుమంచి మండలం చేగొమ్మ నివాసి అని ప్రచారం చేసుకున్నా ఆయన ఆ గ్రామానికి ఎలాంటి అభివృద్ధి చేయలేదని, అక్కడ పది మంది పేర్లు కూడా ఆయనకు తెలియదన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ఎక్కువ సీట్లు గెలుస్తుందని పలు సర్వేలు తెలిపాయని గుర్తు చేశారు. కేసీఆర్ బస్సు యాత్ర ద్వారా ప్రజల్లోకి రావడం, కాంగ్రెస్ విధానాలను ఎండగట్టడం వల్ల బీఆర్‌ఎస్‌కు మంచి గ్రాఫ్ పెరిగిందన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు బెల్లం వేణు, సొసైటీ వైస్ చైర్మన్ చామకూరి రాజు, ఎంపీటీసీ పులుగుజ్జు వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు పరికపల్లి చంద్రశేఖర్, పసలాది ముత్తయ్య, నాయకులు తాతా రవీందర్, దూదిమెట్ల శ్రీను, చామకూరి కిరణ్, వెంకట్, శరత్, గోకినపల్లి ఉపేందర్, ఐలపొంగు వెంకన్న, గోపోజి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పటిష్ఠ భద్రత మధ్య పోలింగ్

### కలెక్టర్, సీపీ, ఎస్పీల సమన్వయంతో అల్లర్లకు చెక్



సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించిన సీపీ సునీల్‌దత్

మామిళ్లగూడెం, మే 13 : ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సోమవారం పటిష్ఠ భద్రత నడుమ పోలింగ్ ముగిసింది. 1,896 పోలింగ్ కేంద్రాల్లో మొదటి సారిగా అన్ని కేంద్రాలను వెబ్ కాస్టింగ్ చేయడంతోపాటు సాంకేతికతను వినియోగించి కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టారు. కలెక్టర్ వీపీ గౌతమ్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజుల సమన్వయంతో ప్రశాంత వాతావరణలో ఎన్నికలు ముగిశాయి. పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఖమ్మం కలెక్టర్ గౌతమ్ ఆధ్వర్యంలో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు, ఉద్యోగుల సమన్వయంతో ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచి పోలింగ్ వరకు నిరంతర పర్యవేక్షణ, సమీక్షలు, సమన్వయంతో ఎన్నికల నిర్వహణ పనులను సజావుగా జరిపించారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పర్యవేక్షణలో నిరంతర నిఘాతో అంతర్ జిల్లా, అంతర్రాష్ట్ర చెక్ పోస్టులతోపాటు పూర్తిస్థాయి ఇంటెలిజెన్స్ నివేదికలతో అల్లర్లు, అక్రమాలకు చెక్ పెట్టారు.

**క్యూలో నిల్చొని ఓటేసిన కలెక్టర్ దంపతులు**

ఖమ్మం కలెక్టర్ గౌతమ్ దంపతులు జిల్లా అటవీ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో క్యూలో నిల్చొని ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ పోలింగ్ సజావుగా జరుగుతున్నదని, కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు చేశామన్నారు.




